# కొంప మాత్రం మిగిలింది

"ఏదో భగవంతుడి దయవల్ల కొంప మాత్రం మిగిలింది" అన్నది మాచమ్మ - మహాలక్ష్మమ్మ. అసలు పేరు మహాలక్ష్మి.

గడప మీద కూర్చుని గత అయిదారు నిముషాలుగా ఇటీవలే కాలం చేసిన తన ఒక్కగా నొక్క కొడుకును గురించి చెప్పవలసినవన్నీ చెప్పి చివరకు అన్న మాట లివి.

చత్వారపు కళ్లజోడు తీసి, ధోవతి కొంగుతో ముఖం తుడుచుకుంది ముందు. ఆ తర్వాత అద్దాలు తుడుచుకుంది. మళ్లీ జోడు ముఖానికి తగిలించుకుంది.

కుర్చీలో కూర్చుని అంతవరకూ ఆమె చెప్పిన విషయాలు విని నిట్టూర్చాను.

"నిండా నలభై ఏళ్లు లేవు!" అన్నాను.

"కాదులే, ఈ నెలతో నలభై రెండు వెళ్లి మూడు వస్తుంది" అన్న దామె.

"అది మాత్రం ఏం వయస్సని? అరవై డెబ్భై దాటి రాళ్లలాగా తిరుగుతున్న వాళ్ళందరు లేరూ!"

"అదేమన్నమాట! అందరూ ఇలాగే ఉంటున్నారా? వయస్సులో ఉన్నప్పుడు 'పెళ్లి చేసుకోరా నాయనా' అని శతపోరితే విన్నాడా? 'నాటకాలు నాటకాలు' అని చిందులు తొక్కాడు తప్ప ఇల్లూ, పెళ్లాం, పిల్లలూ అన్న యావ ఉంటేనా?" అంటూ మళ్లీ కళ్లు తుడుచుకుంది ఆమె.

నేను లేచి గొడుగు అందుకుని, "వెళ్లొస్తాను" అన్నాను.

"మంచిది, నాయనా! వెళ్లిరా! అప్పుడప్పుడూ వస్తూ ఉండు!"

నేను కదిలాను. ఎందుకో దిగులు కలిగింది.

వీధి మలుపు తిరుగుతూండగా చప్పట్లు వినిపించాయి. వెనుదిరిగి చూద్దును కదా! ఒక ఇంటి గేటు ముందు లుంగీ కట్టుకుని, కేవలం పై పంచెతో నిలబడి ఉండి నన్నే పిలుస్తున్నారెవరో, "నిన్నే... నిన్నే!" అన్నారు కూడా పెద్దగా.

అటు నడిచాను.

రామకృష్ణ. మాచమ్మ కొడుకు సత్యానికీ, నాకూ స్నేహితుడు.

"నిన్నే! రారా!" అన్నాడతను మళ్లీ.

వెళ్లగానే ఎదురొచ్చి చేతులు పట్టుకుని, "ఎన్నాళ్ల కెన్నాళ్లకు" అన్నాడు. లోపలికి దాదాపు లాక్కుపోయాడు.

వరండాలో కూర్చోబెట్టి, గుమ్మంలో నిలబడి, "ఏమేవ్! ఎవరొచ్చారో చూడు!" అంటూ భార్యను పిలిచాడు.

ఆమె వస్తూనే చేతులు జోడించి, "అప్పుడెప్పుడో సభలో చూశాను" అన్నది.

"కూర్చోండి, కాఫీ తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది.

రామకృష్ణ నన్ను కుర్చీలో కూలవేసి తాను మరో కుర్చీలో సెటిలై, "ఊఁ, చెప్పు! ఎక్కడుంటున్నావు? ఏమిటి సంగతి?" అని అడిగాడు.

నేను అన్నీ చెబితే విని, "మొత్తానికి ఉద్యోగం పుణ్యమా అని దేశమంతా తిరుగుతున్నావన్నమాట! గుడ్!" అన్నాడు. ఆమాటా, ఈమాటా పూర్తి అయ్యాక, కాఫీ సేవనం పూర్తి అయ్యాక, "ఇప్పు డెక్కడి నుంచి వస్తున్నావు?" అని అడిగాడు.

"మన సత్యం పోయాడని తెలిసి - అదీ ఫేపర్లో చదివాను. ఎలాగూ ఈ ఊరు వచ్చాంకదా ఒకసారి ఆ ముసలామెను చూసిపోదామని వచ్చాను."

"చూశావా?"

"ఆఁ, చాలా దారుణంగా ఉంది పరిస్థితి. ముసలమ్మ ఊరికే ఏడుస్తుంది. ఏదో ఆ ఇల్లు మాత్రం మిగిల్చాడు సత్యం. వచ్చే బాడుగరాళ్లతో బతుకుతున్నది. అదీ లేకపోతే ఆమె బతుకు రోడ్లపాలై ఉండేది, పాపం!"

రామకృష్ణ నిట్టూర్చాడు. "సత్యం ఎలా పోయాడో చెప్పిందా నీకు?" అని అడిగాడు.

"ఆఁ నాటకం వెయ్యడానికి వెళ్లాట్ట. వారం రోజులపాటు ప్రోగ్రాములు. మామూలు వేషమే. మూడో కృష్ణుడు. తెల్లవారుజామున నటిస్తూనటిస్తూ స్టేజీ మీద కుప్పకూలిపోయాట్ట. పాడుతూ పాడుతూనే పడిపోయాట్ట."

"ఇదంతా పేపర్లో వచ్చిందేగా?"

"మరి....?!"

రామకృష్ణ గంభీరంగా- "నేనూ ఉన్నాను ఆనాడు వాడివెంట. నువ్వు చెప్పిందీ, ఆ ముసలమ్మ అనుకుంటున్నదీ, పేపర్లో వచ్చిందీ ఒకటే. కాని అసలు విషయం వేరు." అన్నాడు.

నేను నివ్వెరపోయాను.

"అంటే?"

"అంటేనా! అసలు జరిగింది వేరు" అని మొదలుపెట్టా దతడు.

అసలు జరిగిందేమిటంటే-

సత్యం చాలా ఏళ్లుగా మితంగా తాగుడుకు అలవాటుపడ్డాడు. పెళ్లీ, పిల్లలూ వంటి బాదర బందీలు లేవు, బాధ్యతలు లేవు. ఎదుట యజమాని లేని ఉద్యోగం. చేతినిండా డబ్బు. మంచి రూపంతో, మంచి గాత్రంతో పౌరాణిక పాత్రధారణలో - అందులోనూ ముఖ్యంగా కృష్ణ వేషధారణలో- చక్కని పేరు ప్రతిష్ఠ లుండేవి. రోజూ ఎక్కడో గదిలో తొక్కుడు హార్మోనియం ముందు సహ నటులతో కలసి సాయంవేళ రాగాలు తీసి తీసి తిరిగి వస్తూ, చాలా మితంగా గొంతు తడుపుకుని వచ్చేవాడు.

తల్లి - "ఏమిటీ వాసన?" అని అడిగితే, "అది స్కూటర్ పెట్రోల్ వాసనలే" అని ఆ అమాయకురాలు నమ్మబలికేవాడు. పగటివేళ మామూలుగా తన ఉద్యోగ

బాధ్యతలు - డాక్టర్ల చుట్టూ తిరగడం, మందుల గురించిన లెక్చరర్లివ్వడం వంటివి చూసుకునేవాడు. ఇటీవల వరుసగా అయిదారు ప్రోగ్రాములు - ఉద్యోగ విజయాలు పెద్ద టీమ్‌తో పడ్డాయి. ఇతని పాట అంటే జనానికి మక్కువ ఎక్కువ కావడంతో అర్ధరాత్రి దాటాక మూడో కృష్ణుడుగా గిరాకీ ఉండేది. అతి దీర్ఘ రాగాలకు శ్రోతలు పరవశులై కరతాళ ధ్వనులతో, వన్స్‌మోర్‌లతో స్పందించేవారు. అతడు మరింత రెచ్చిపోయి పాడేవాడు. ఆనాడు పదిన్నరకు నాటకం మొదలైంది. సత్యంతోపాటు ఒక వ్యక్తి హాలు వెనక చివర గదిలో కూర్చుని ఉన్నాడు. తాను అతని వీరాభిమానినని చెప్పుకున్నాడు. కాసేపయ్యాక సత్యం నిట్టూర్చి - "ఏమిటో... బాగులేదు. ఈ మధ్య అంతా డల్‌గా ఉంది. కాస్త గొంతు తడుపుకునే సావకాశం లేకుండా పోయింది" అన్నాడు.

ఆ వ్యక్తి నవ్వాడు. సత్యం మళ్లీ "నిషేధం నాటికి ముందుగా నాలుగైదు బాటిల్స్ మా మదర్‌కు తెలియకుండా 'మందులులే' అని చెప్పి స్టాక్ చేసుకున్నాను. కాని ఎంత పొదుపు పాటించినా పదిహేను రోజులు కూడా రాలేదు. అప్పటినుంచి పరగడుపే, మునుపు కాస్త గొంతు తడుపుకుని స్టేజి ఎక్కితే ఎంత బాగుండేది! అలుపూ సొలుపూ ఉండేది కాదు. అలాంటిది ఉన్నట్టుండి ఒక్కసారి బంద్ అయ్యేసరికి హుషారే పోయింది. గొంతు మునుపటిలా పలకడంలేదు. పైగా తొందరగా అలుపొచ్చేస్తున్నది" అన్నాడు.

"ఈ నిషేధం దారి నిషేధానిదే. మందుదారి మందుదే! అయినా వాళ్ల పిచ్చి గాని, ఈకాలంలో, పసిపిల్లలకు కూడా అన్నీ తెలిసిన ఈ కాలంలో ఇలాంటి నిషేధాలు ఏం సాధించగలవు సార్? లక్షలాది రకరకాల వాహనాలు, వందలాది రైళ్లు దేశమంతా తిరుగుతూండగా, చుట్టుపక్కల దేశమంతా బ్రాందీ, విస్కీలు పుష్కలంగా దొరుకుతూండగా ఎన్ని ఆంక్షలు పెడితే మాత్రం ఏం లాభం? మన రాజకీయుల, అధికారుల తంతు తెలుసు కదా? చిన్న పదవిలో ఉన్నవాడు సైతం 'సంతకాని కింత' అని బాహాటంగా పుచ్చుకునే సమాజం మనది. ఇచ్చేందుకు సిగ్గుపడకపోగా, 'ఇవ్వకపోతే పను లెలా జరుగుతాయి' అని ఇచ్చేవారు సమర్థించుకునే దేశం మనది. పైగా ఏ కెమిస్ట్రీ స్టూడెంట్‌గాడైనా తయారుచేయగలడు విస్కీ బ్రాందీలను. ఇక పల్లెపట్టు లన్నీ బహిరంగ లేబొరేటరీలే. చెట్టు చెట్టు చాటున సారా. ఒకప్పుడు ఎక్కువమందికి దాని తయారీ గురించి తెలియని రోజుల్లో, తాగడం గొప్ప పాపమని అందరూ భావించిన రోజుల్లోనే విఫలమైతే ఎత్తేసిన పనికిరాని నిషేధం ఇది. ఇప్పుడు కాస్త చదువుకున్న ప్రతి గన్నాయిగాడికీ దాని తయారీ తెలుసు. పైగా, దారుణ మేమిటంటే కల్లు పరవాలేదుట, పనికొస్తుందట. ఇక కల్తీ సరుకు ముమ్మర మవుతుంది చూడండి. చూస్తు ఉండండి!"

ఆ వ్యక్తి ఇలా మాట్లాడుతూ ఉండేవాడే ఇంకా - సత్యం అంతటితో అతన్ని ఆపి, "అది సరే, ముందు మన కెక్కడైనా కొంచెం మందు దొరుకుతుందేమో చెప్పండి" అంటూ ముగ్గులోకి వచ్చాడు.

"దానిదేముంది, లేవండి!" అన్నాడతను.

ఇద్దరూ లేచి ఇవతలికి వచ్చారు. లోపల నాటకం నడుస్తున్నది.

అతడు మళ్లీ కొనసాగించాడు– "ఒక తేదీ నిర్ణయించారు. ఆ తేదీ దాటాక ఆ రాత్రితో అమ్మకాలు ఆపేసి షాపులకు తాళాలు వేసి, సీళ్లు వేసి లోపల ఉన్న సరుకంతటినీ గవర్నమెంటోడి కప్పజెప్పి తూర్పు తిరిగి దణ్ణం పెట్టాలట. అట్టా ఎవరైనా అప్పజెపుతారా? ఈ జనమంతా అంత త్యాగశీలురై ఉండాలా? మీరు మాత్రం కట్టవలసిన పన్నులు కూడా ఎగ్గొట్టి సమాజాన్ని దోచుకుని పదవులు పొంది కులకవచ్చు. జనం మాత్రం త్యాగ గుణం కలవారై ఉండాలి. యుద్ధమొచ్చినా, తుఫానొచ్చినా – ఆ మాటకొస్తే ఏమీ రాకపోయినా జనం మాత్రం త్యాగాలు చెయ్యాలి, చేస్తూ ఉండాలి."

సత్యం వింటూ నడిచాడు.

అతడు మళ్లీ – "ఒక వైన్‌షాపు యజమాని నాకు తెలిసినవాడే. అంత త్యాగం అతనివల్ల కాలేదు. ఆనాటికి ఏదో నామకః కొన్ని సీసాలు షాపులో అట్టేపెట్టి, మిగిలిన స్టాకు అక్కడక్కడా దాచిపెట్టేశాడు. అది నెమ్మది నెమ్మదిగా, ఇదిగో ఇలాంటి అర్జెంట్ కేసుల్లో నాలుగైదు రెట్లు రేటు పెంచి సొమ్ము చేసుకుంటున్నాడు" అన్నాడు.

పుచ్చపువ్వులా వెన్నెల... సత్యం మనసులో కొత్త హుషారు.

ఆ వ్యక్తి ఒకచోట సత్యాన్ని నిలిపి ఉంచి ఒక చిన్న సందులోకి వెళ్ళి ఒకటి రెండు నిముషాలలో ఖాళీ చేతులతో తిరిగి వచ్చాడు.

"సారీ సార్! స్టాక్ అయిపోయిందట" అన్నాడు.

"అరె! ఎలా ఇప్పుడు?" అన్నాడు సత్యం ఏదో కొంప మునిగిపోయినట్టు, జరగరానిది జరిగినట్టూ గొప్ప ఆశాభంగంతో.

"మీ కెందుకు, నే నున్నాను, సార్! రండి, ఇంతలోనే అయిపోయిందా? కనీసం వారానికి ఒక లారీలో సగం లోడ్ వస్తూ ఉంటుంది ఇక్కడికి. ఇదంతా మంత్రిగారి ఇలాఖా. ఇక్కడ ఎవరూ అడుగు పెట్టరు. ఇటు మద్రాసు నుంచో, అటు మహారాష్ట్ర నుంచో, కర్ణాటక నుంచో, కాకపోతే ఒరిస్సా, అస్సాం నుంచో, అదీ కాకపోతే హర్యానా, రాజస్థాన్ నుంచో పుష్కలంగా సరుకు వస్తూనే ఉంటుంది. ఎక్కడెక్కడికి రోడ్డు సౌకర్యం, రైలు సౌకర్యం ఉందో, అక్కడక్కడ నుంచి దిగుమతి అవుతూనే ఉంటుంది. కాకపోతే కొంచెం శ్రమ, ఖర్చు తప్పవు. అంతే మరి! శ్రమ పడకపోతే ఏది మాత్రం ఎలా వస్తుంది చెప్పండి.?"

అతడు ఈసారి మరో వైపు దారితీశాడు.

రెండు నిముషాలు నడక. ఈసారి అతను చేతిలో సంచీతో వచ్చాడు.

సత్యం హడావుడిగా "ఎంత?" అన్నాడు.

"నాలుగొందలు. ఫుల్."

"మరొకటి దొరకదా?"

"చూద్దాం!" అంటూ అతడు ఎనిమిది వందలూ తీసుకెళ్లి ఈసారి నిండు సంచితో వచ్చాడు.

అక్కడ నాటకం కొనసాగుతున్నది. జనం హాలునిండా నిండి పద్య నాటకాన్ని చక్కగా ఆనందిస్తున్నారు.

సత్యం ఇన్నాళ్లుగా దాహం గొన్నవాడిలా మౌనంగానూ, వేగంగానూ లాగించేశాడు. సీసా మూడువంతులు అయిపోయింది. ఆ వ్యక్తి కొద్దిగా మాత్రం పోసుకున్నాడంతే.

సత్యం అతనితో, "నాటకానికి ఉండాలా?" అన్నాడు.

అతడు కదిలి వెళ్లిపోయాడు. సమాధానం ఏమీ రాలేదు. సత్యం వాచీ చూసుకున్నాడు.

అవతల చప్పట్ల హోరు ఎక్కువగా ఉంది. మంచి ప్రేక్షకులు.

'అలాంటి ప్రేక్షకులు దొరికితే నటుడికి మరింకేం కావాలి?' అనిపించింది.

మేకప్ ముగించుకుని కిరీటధారణకు ముందు సీసా వంచి గొంతులో పోసుకున్నాడు. లోపలి నుంచి ఎక్కడెక్కడి నరాల్లోనో నిద్రాణమై ఉన్న శక్తి తన్నుకుని గొంతులోకి వచ్చినట్టనిపించింది.

ఆ తర్వాత చివరి కృష్ణుడుగా రంగప్రవేశం చేశాడు. జనం రెచ్చిపోయి ఈలలు కేకలతో, కరతాళ ధ్వనులతో అతన్ని ఆహ్వానించారు. తర్వాత నిశ్శబ్దం నెలకొన్నది.

సత్యం ఒక అరగంట సేపు స్వైరవిహారం చేశాడు.

గొంతులో అద్భుతమైన ధ్వనులు పలికించాడు.

ప్రతి పద్యానికీ ప్రేక్షకుల స్పందన మితిమీరిపోయింది.

అప్పుడు....

ఒక పద్యం ముగించి రాగం తీస్తూ తీస్తూనే నెమ్మది నెమ్మదిగా రంగస్థలం మీదనే ఒరిగిపోయాడు. గొంతు మూగపోయింది. కల్తీ సరుకు కాటువేసింది.

పేపర్లలో మాత్రం 'ప్రముఖ రంగస్థల నటుని నిర్యాణం', 'రంగస్థలం మీదనే ప్రాణం విడిచిన మహానటుడు'వంటి హెడ్డింగులతో వార్తలు వచ్చాయి.

రామకృష్ణ విషయం ముగించి, "నేను ఆనాడు నాటకం పూర్తిగా చూడదలుచుకుని మొదటినుంచీ జనంలోనే కూర్చుండిపోయాను. లేవనైనా లేదు. ఇంత కథ నాకు తెలియకుండానే జరిగిపోయింది. అతని బాడీ తీసుకువస్తూ దోవలో అడవి మధ్యలో కారు ఆపించి, దూరంగా నడిచివెళ్లి అతని సంచిలో ఉన్న రెండో విషం బాటిల్‌ను రాళ్ల మీద విసిరి పారేశాను" అన్నాడు.

కొన్ని నిముషాలు అలాగే నిశ్శబ్దంగా కూర్చుండిపోయాను.

తర్వాత లేచాను, "వస్తాను బ్రదర్!" అన్నాను.

"అప్పుడప్పుడూ వస్తూ ఉండు!" అన్నాడతను.

❀ ❀ ❀